సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



భారీగా గంజాయి స్వాధీనం

జీకే వీధి, జి.మాడుగుల మండలాల్లో పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 8లో



పర్యావరణ పరిరక్షణకు కృషి

మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో, జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా నోడల్ అధికారి తెలిపారు. 8లో



క్రీడాకారులకు ప్రోత్సాహం

క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

పాపికొండల పర్యాటకం పునః ప్రారంభం



పర్యాటకులతో వెళుతున్న హరిత బోటు

వీఆర్‌పురం: వరద ప్రభావంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బోటు నిర్వాహకులు గత జూలై నెలలో నిలిపివేసిన పాపికొండల పర్యాటకాన్ని మళ్లీ ప్రారంభించారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో సబ్‌కలెక్టర్ సూరజ్‌గనోరే పర్యాటకాన్ని పునఃప్రారంభించేందుకు అనుమతి ఇచ్చారని టూరిజం యూనిట్ ఇన్‌చార్జ్ మేనేజర్ రాజేష్ తెలిపారు. ఆదివారం 80 మంది పర్యాటకులతో ఏపీ టూరిజానికి చెందిన హరిత బోటు పాపికొండల పర్యాటకానికి గోదావరి నదిలో వెళ్లిందని ఆయన చెప్పారు.

డోలీపై తరలిస్తుండగా ప్రసవం

మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో చింతపల్లి తరలింపు



ప్రసవానికి ముందు డోలీమోతపై మంగమ్మను తీసుకెళ్తున్న గ్రామస్తులు


కొయ్యూరు: పురిటి నొప్పులు రావడంతో ఆదివాసీ గర్భిణిని డోలీలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. బూదరాళ్ల పంచాయతీ గరిమండకు చెందిన బోనంగి మంగమ్మకు ఆదివారం పురిటి నొప్పులు వచ్చాయి. ఈ గ్రామానికి రోడ్డు సరిగా లేదు. దీంతో డోలీలో పెదవలస ఆస్పత్రికి తరలిస్తుండగా గ్రామానికి సమీపంలోనే పురిటి నొప్పులు ఎక్కువై ఆమె ప్రసవించింది. అదే సమయంలో 108కు సమాచారం ఇవ్వడంతో కొంత దూరం వరకు వాహనం వచ్చింది. దానిలో మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని మంగమ్మ కుటుంబ సభ్యులు తెలిపారు.

పోర్టులో స్పెషల్ క్యాంపెయిన్

మహారాణిపేట: విశాఖపట్నం పోర్టు అథారిటీలో ఆదివారం స్వచ్ఛ భారత్ అభియాన్ స్పెషల్ క్యాంపెయిన్ 3.0 ప్రారంభమైంది. ఈ నెల 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. డాక్ ఏరియాలో జరిగిన ఈ కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రం చేసేందుకు గంట సమయాన్ని కేటాయించాలన్నారు. పోర్టు పరిసరాల్లో గాలి కాలుష్యాన్ని నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

- పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో శరవేగంగా రెండు యూనిట్ల నిర్మాణం
- పూర్తయితే అదనంగా 230 మెగావాట్ల ఉత్పత్తికి అవకాశం

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం



మరింత... వెలుగు జిలుగులు

రంపచోడవరం/మోతుగూడెం: రాష్ట్ర ప్రజలకు నిరంతరం నాణ్యమైన, తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్‌ను సరఫరా చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా.. ఏపీ జెన్‌కో పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో చేపట్టిన రెండు కొత్త యూనిట్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో ఉన్న జలవిద్యుత్ కేంద్రాల్లో ఎక్కడా కొత్త యూనిట్ల నిర్మాణానికి అవకాశం లేదు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని అప్పటి రష్యా ఇంజినీర్లు మరో రెండు యూనిట్లు నిర్మాణానికి వీలుగా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్మించారు. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాన్ని 1975 సంవత్సరంలో రష్యా సాంకేతిక సహకారంతో నిర్మించారు. దాదాపు 46 సంవత్సరాల తరువాత ఏపీ జెన్‌కో ఇంజినీర్లు కొత్తయూనిట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

నిర్మాణం పూర్తయితే అదనపు విద్యుత్ ఉత్పత్తి

సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని మాచ్‌ఖండ్, అప్పర్ సీలేరు, డొంకరాయి,పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాల ద్వారా రాష్ట్రానికి చౌక విద్యుత్ అందుతోంది. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ఒక్కో యూనిట్ ద్వారా 115 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది. దీంతో నాలుగు యూనిట్ల ద్వారా ప్రస్తుతం 460 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. కొత్తగా నిర్మించే ఐదు, ఆరు యూనిట్ల ద్వారా 230 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అదనంగా జరగనుంది. ఒకటి, రెండు యూనిట్లు రష్యా సాంకేతిక సహకారంతో నిర్మిస్తే, మూడు,నాలుగు యూనిట్లను 1977లో బీహెచ్‌ఈఎల్ సహకారంతో నిర్మించారు. జలవిద్యుత్ కేంద్రం నిర్మించేటప్పుడే ఐదు,ఆరు యూనిట్ల నిర్మాణానికి అనువుగా కొద్దిపాటి కాంక్రీట్ పనులు కూడా పూర్తి చేశారు. ఈ రెండు యూనిట్ల నిర్మాణానికి ఏడాది క్రితమే టెండర్లు పిలిచారు.హైదరాబాద్‌కు చెందిన షిర్డీసాయి ఇంజినీరింగ్ కంపెనీ రూ. 536 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించింది. పొల్లూరు గ్రామం వద్ద పెన్‌స్టాక్ పైపులైన్లను ఎనిమిది నెలల నుంచి తయారు చేస్తున్నారు. పవర్ హౌస్ యూనిట్ల దిగువ భాగానికి సంబంధించి సివిల్ పనులు వేగవంతం చేశారు. జలవిద్యుత్ కేంద్రం నిర్మాణ పనులు సంబంధించి ఇతర పనులు కూడా వేగవంతం చేశారు. సీలేరు జలవిద్యుత్ కేంద్రం వద్ద రివర్స్‌బుల్ టార్బ్సాన్స్ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పర్ సీలేరు జలవిద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలైన నీటిని ఎత్తిపోతలు పథకం ద్వారా తిరిగి సీలేరు జలాశయంలోకి పంపించి పీక్‌లోడ్ అవర్స్‌లో చౌక జలవిద్యుత్ ఉత్పత్తికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎత్తిపోతల పథకానికి సంబంధించి అటవీ, పర్యావరణ అనుమతులు లభించాయి. ఎత్తిపోతల పథకం నిర్మాణానికి టెండర్లు పిలిచేందుకు రంగం సిద్ధం చేశారు. సుమారు రూ.10 వేల కోట్ల వ్యయంతో నిర్మాణం చేయనున్నారు. ఇటీవల జెన్‌కో ఉన్నతాధికారుల బృందం సందర్శించి టెండర్లు వేగవంతం చేసేందుకు యుద్ధప్రాతిదికన చర్యలు తీసుకుంది.

వేగంగా పనులు

> పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్ల నిర్మాణానికి సంబంధించి పనులు వేగంగా జరుగుతున్నాయి. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేయించి, విద్యుత్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.
>
> – బి.శ్రీధర్, ఏపీ జెన్‌కో సీఈ, మోతుగూడెం



పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో యూనిట్లు



ఐదు,ఆరు యూనిట్లు నిర్మించే ప్రాంతం

తెలతెలవారక ముందే..



తుంపాడలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మహేష్



అనంతగిరి మండలం లక్ష్మీపురంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుమిత్ర

- పండుటాకుల చేతికి వైఎస్సార్ పింఛన్ కానుక
- జిల్లాలో మొదటి రోజు 56.54 శాతం పంపిణీ

సాక్షి,పాడేరు: జిల్లాలోని 22 మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఆదివారం వేకువజాము నుంచే వైఎస్సార్ పింఛన్‌కానుక సొమ్ము పంపిణీని వలంటీర్లు హుషారుగా చేపట్టారు. జిల్లాలో 1,28,855 మంది పింఛన్‌దారులు ఉండగా, ఆదివారం రాత్రి 8.30 గంటల సమయానికి 72,859 (56.54శాతం) మందికి పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. కూనవరం మండలంలో 3,975 మందికి గాను 3,364 (84.63శాతం)మందికి తొలిరోజే పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీలో కూనవరం మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో సాధించింది. మరో 14 మండలాల్లో 50 నుంచి 72శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. జిల్లాలోని అన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. కోడికూయక ముందే నగదు అందడంతో సామాజిక పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేశారు. మరో మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా నూరుశాతం పింఛన్ల పంపిణీని పూర్తిచేస్తామని డీఆర్‌డీఏ పీడీ మురళీ 'సాక్షి'కి తెలిపారు.

భలే భలే 'బంతి'



డుంబ్రిగుడ మండలం అరకు-పాడేరు ప్రధాన రోడ్డులో రైల్వే గేటు సమీపంలో లచ్చన్న అనే గిరిజనుడు సాగుచేస్తున్న బంతి పూల తోట ఆ ప్రాంతవాసులకు కనువిందు చేస్తోంది. చాపరాయి జలపాతాన్ని తిలకించేందుకు వస్తున్న పర్యాటకులను ఈ తోట ఆకర్షిస్తోంది. ఇక్కడ ఫొటోలు తీసుకునేందుకు సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు. – డుంబ్రిగుడ

వహ్వా.. 'కాఫీ'

- తోటలను సందర్శించిన ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి చలపతిరావు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో ఏపీ అటవీ అభివృద్ధి సంస్థ ఆధీనంలో సాగవుతున్న కాఫీతోటలు, అంతరపంటగా వేసిన మిరియాల పాదులను సందర్శించి సీనియర్ ఐఎఫ్‌ఎస్ అధికారి,రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శి పి.వి.చలపతిరావు ఫిదా అయ్యారు. ఏజెన్సీలో రెండు రోజుల నుంచి కుటుంబంతో వ్యక్తిగత పర్యటనలో ఉన్న ఆయన ఆదివారం పాడేరులోని మోదకొండమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి, మోదమ్మకు సతీసమేతంగా పూజలు చేశారు. అనంతరం చలపతిరావు దంపతులకు డీఎఫ్‌వో వినోద్‌కుమార్, ఫారెస్ట్ అధికారి శ్రీనివాసరావు,ఆలయ కమిటీ ప్రతినిధులు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. తరువాత మినుములూరు ఏపీఎఫ్‌డీసీ పరిధిలోని సంగోడి ఎస్టేట్ కాఫీతోటలు, మిరియాల పాదులను పరిశీలించారు. పాడేరు డివిజన్ వ్యాప్తంగా ఏపీఎఫ్‌డీసీ ఆధీనంలో సాగవుతున్న కాఫీతోటలు ద్వారా వస్తున్న ఆదాయం వివరాలను తెలుసుకున్నారు. మినుములూరులోని మిరియాల పాదుల నర్సరీలు, మిరియాల సాగును కూడా ప్రత్యేకాధికారి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



సంగోడి కాఫీ ఎస్టేట్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి



మోదకొండమ్మను దర్శించుకుంటున్న చలపతిరావు దంపతులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- జేసీ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్
- పాడేరులో స్వచ్ఛతా హీ సేవ

పాడేరు రూరల్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా జీవించవచ్చని జేసీ శివ శ్రీనివాస్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆదివారం పాడేరులో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమాన్ని జేసీ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ శివ శ్రీనివాస్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాలను 15 రోజుల నుంచి ఐటీడీఏ పరిధిలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వాటి వివరాలను ఎప్పటికప్పుడు జాతీయ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్టు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, పలు శాఖల జిల్లా స్థాయి, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో...

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని స్వచ్ఛతాహీ సేవలో భాగంగా పాడేరు సీఐ సుధాకర్, ఎస్‌ఐ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఏపీఎస్పీ పోలీసులు తొలగించారు. క్రీడా మైదానంలో ఎవరైన మద్యం తాగినా, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేసీ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్



పాడేరు కళాశాల మైదానంలో చెత్తను తొలగిస్తున్న సీఐ సుధాకర్, ఎస్‌ఐ రంజిత్‌కుమార్

నేడు అరకులోయలో..

అరకులోయ రూరల్: గాంధీ జయంతిని పురస్కరించుకుని అరకులోయలో సోమవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్టు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభా సోమేశ్వరి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్,అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, భాగ్యలక్ష్మి, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర పాల్గొనున్నట్టు చెప్పారు.

పర్యాటకుల జోష్

- కిటకిటలాడిన టూరిస్టు స్పాట్‌లు
- వాహనాలతో రద్దీగా మారిన ఘాట్ రోడ్డు



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు



బొర్రా గుహల వద్ద ..



పర్యాటకులతో కిటకిటలాడిన అరకు రైల్వేస్టేషన్

సాక్షి,పాడేరు/జి.మాడుగుల/డుంబ్రిగుడ/అనంతగిరి: జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఎక్కడ చూసినా పర్యాటకుల జోష్ కనిపించింది. ఆదివారం పర్యాటక ప్రాంతాలకు సందర్శకులు పోటెత్తారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలు కిటకటలాడాయి. పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో మైదాన ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మారేడుమిల్లి, చింతూరు, ఘాట్‌రోడ్డుతో పాటు సీలేరు, మోతుగూడెం, లంబసింగి, తాజంగి, కొత్తపల్లి, వంజంగి, అరకు, అనంతగిరి,డుంబ్రిగుడ మండలాల్లో టూరిస్టు స్పాట్‌లకు పర్యాటకులు పోటెత్తారు. హుకుంపేట, వంజంగిహిల్స్‌లోని ప్రకృతి అందాలను ఉదయం నుంచే వీక్షించారు. పర్యాటకుల రాకతో అరకు రైల్వేస్టేషన్‌లో రద్దీ నెలకొంది.

రెండు రోజుల్లో రూ. 6.81 లక్షల ఆదాయం

అనంతగిరి మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు శనివారం, ఆదివారం రెండు రోజులు పర్యాటకులు పోటెత్తారు. శనివారం 3,200 మంది గుహలను తిలకించగా, రూ.2.60 లక్షల ఆదాయం వచ్చింది. ఆదివారం 5,072 మంది గుహలను సందర్శించగా రూ.4.21 లక్షల ఆదాయం లభించిందని మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు. తాటిగుడ, సరియా, చిట్టంపాడు, కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్, తదితర ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి. అరుకు-విశాఖ ప్రధాన రహదారి, ఘాట్‌రోడ్డు ప్రైవేటు వాహనాలతో రద్దీగా మారింది. పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు పర్యాటకులు వాహనాల్లో తరలిరావడంతో రద్దీవాతవరణం నెలకొంది.

జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతానికి ఆదివారం పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చి సందడి చేశారు. ఒడిశా రాష్ట్రం నుంచి కూడా అధిక సంఖ్యలో వచ్చి కేరింతలతో గంటల తరబడి జలకాలాడారు. రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా... ఉత్సాహంగా..... గడిపారు.

ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతాన్ని సందర్శించేందుకు ఆదివారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఆట పాటలతో సందడి చేశారు. థింసా నృత్యాన్ని తిలకించి సంబరపడ్డారు. చాపరాయి జలపాతం వద్ద వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులకు మంచి ఆదాయం లభించింది.

లంబసింగి అందాలకు అనకాపల్లి కలెక్టర్ ఫిదా

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్ లంబసింగి అందాలకు అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఫిదా అయ్యారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించారు. గతంలో పాడేరు ఐటీడీఏ పీవోగా పనిచేసిన ఆయనను ఇక్కడ ప్రకృతి అందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పలు మార్లు లంబసింగి అందాలను వీక్షించిన ఆయన తాజాగా మళ్లీ కుటుంబ సభ్యులతో కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించారు.



లంబసింగి అందాలు తిలకిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి



వంజంగి హిల్స్‌పై సందర్శకులు

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

జి.మాడుగుల: ప్రభుత్వ స్థలాలు, పీహెచ్‌సీల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్ బాషా, జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా ముందుగా పీహెచ్‌సీ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవి చంద్రశేఖర్, ఆరోగ్య విస్తరణ అధికారి నడిగట్ల ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుతో విద్యార్థికి అస్వస్థత

అడ్డతీగల: స్థానిక గురుకుల పాఠశాలలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా తుప్పలు తొలగిస్తుండగా ఏడవ తరగతి విద్యార్థి అరవింద్ పాముకాటుకు గురయ్యాడు. వెంటనే పాఠశాల ప్రిన్సిపాల్ హరినాథ్ ఇతర ఉపాధ్యాయులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, ఆందోళన చెందవలసిన అవసరం లేదని వైద్య సిబ్బంది తెలిపారు.

'కాఫీ బోర్డు ప్రదర్శన'లో జీకే వీధి రైతులు


ప్రదర్శనకు హాజరైన సభ్యులు

గూడెంకొత్తవీధి: కేంద్ర కాఫీ బోర్డు వాణిజ్య పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు బెంగళూరులో నిర్వహించిన ప్రదర్శనలో జీకే మండల కేంద్రంలోని మణి అమ్మ చైతన్య ప్రవంతి అనే స్వచ్ఛంద సంస్థ నుంచి పలువురు గిరిజన రైతులు పాల్గొన్నారు. కాఫీతో తయారు చేసే వివిధ రకాల ఉత్పత్తులపై వీరు అవగాహన ఏర్పర్చుకున్నారు. ఈ ప్రదర్శన వల్ల కాఫీ రైతుల్లో అవగాహన పెరుగుతుందని సంస్థ ప్రతినిధి అలివేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు సన్యాసయ్య,చిన్నబ్బాయి, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- అండర్–11 జాతీయ చదరంగం చాంపియన్‌షిప్ ప్రారంభం


ఫిడే మాస్టర్ సాహితీతో ఎత్తుకు పైఎత్తుకు వేస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి


విశాఖ పోర్ట్‌స్టేడియంలో చదరంగం పోటీలు

విశాఖ స్పోర్ట్స్: విద్యార్థులకు మెరుగైన వసతులతో కూడిన విద్య, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్యం, యువత మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. పోర్ట్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం అండర్–11 జాతీయ చదరంగం చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలను అందించి ప్రోత్సహిస్తోందన్నారు. విశాఖలో అంతర్జాతీయ స్టేడియం నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయదశమి నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన ప్రారంభిస్తుండటంతో.. విశాఖలో మరిన్ని వసతుల కల్పనతో పాటు అభివృద్ధి వేగవంతం కానుందన్నారు. విశాఖ వేదికగా జాతీయ స్థాయిలో చదరంగం పోటీలు నిర్వహించడం... ఇక్కడ నుంచే ఆలనా మీనాక్షి, సాహితీ వర్షిణి లాంటి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. అనంతరం ఫిడే మాస్టర్ టైటిల్ సొంతం చేసుకున్న సాహితీ వర్షిణితో తొలి మూవ్ వేసి చాంపియన్‌షిప్‌ను ప్రారంభించారు. టాప్ బోర్డుపై ఆడుతున్న ఫిడే రేటెడ్ క్రీడాకారులతో పాటు పోటీకి సిద్ధపడిన పలువురి చిన్నారులను సుబ్బారెడ్డి పరిచయం చేసుకుని వారిలో ఉత్సాహం నింపారు. వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌కాప్ చైర్మన్ కె.కె.రాజు, ఆంధ్రా చెస్ సంఘం అధ్యక్షుడు కె.వి.వి.శర్మ, రాష్ట్ర, జిల్లా చదరంగం ప్రతినిధులు, టోర్నీ నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ చాంపియన్‌షిప్ ఓపెన్ కేటగిరీలో 193 బోర్డులపై 385 మంది.. బాలికల విభాగంలో 98 బోర్డులపై 194 మంది తొలి రౌండ్‌లో పోటీపడ్డారు. వీరిలో కొంత మంది ఫిడే రేటెడ్ ఆటగాళ్లతో పాటు మాస్టర్స్ టైటిల్స్ సొంతం చేసుకున్న చిన్నారులు ఉన్నారు.

ఎత్తుకు పైఎత్తులు

విశాఖ స్పోర్ట్స్: అండర్–11 జాతీయ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌లో రేటెడ్ ఆటగాళ్లు విజయాలతో తొలి రౌండ్‌ను ముగించి రెండో రౌండ్‌కు చేరుకున్నారు.

ఎరీనా ఫిడే మాస్టర్(ఏఎఫ్‌ఎం) హన్షిత్, ఎరీనా క్యాండిడేట్ మాస్టర్లు(ఏసీఎం) కపిల్ నితిన్, రైవాన్ తొలి రౌండ్‌లో ఓటమితో వెనుకబడ్డారు. టోర్నీ టాపర్‌గా బరిలోకి దిగిన కర్నాటక చిన్నారి అపార్, ఏఎఫ్‌ఎంలు పవన్, ఆరవ్, పరంబ్రాతా, యువనేష్, ఆద్యాన్ తొలి రౌండ్‌లో విజయం సాధించారు. ఏసీఎంలు జలకాష్, విశ్వత్, బాలానందన్, తవిష్, కార్తికేయ, స్వయమ్, క్యాండిడేట్ మాస్టర్(సీఎం) వివాన్, ఎరీనా ఇంటర్నేషనల్ మాస్టర్(ఏఐఎం) సయిద్, ఆదిక్ తొలి రౌండ్‌లో సత్తా చాటి రెండో రౌండ్‌కు సిద్ధమయ్యారు.

టోర్నీ టాపర్‌గా బరిలోకి..



కర్నాటక నుంచి ఈ టోర్నీలో పాల్గొనేందుకు వచ్చాను. 2067 ఫిడే రేటింగ్‌తో టోర్నీ టాపర్‌గా అవకాశం వచ్చింది. స్టాండర్డ్ చెస్‌తో పాటు ర్యాపిడ్, బ్లిట్జ్ చదరంగంలోనూ పోటీపడుతుంటాను. జాతీయ స్థాయిలో యాక్టివ్ ప్లేయర్స్ లిస్టింగ్‌లో 369వ ర్యాంక్‌లో ఉన్నాను. టాప్ ర్యాంక్‌ను కొనసాగిస్తూ ఫిడే రేటింగ్‌ను మెరుగుపరుచుకుంటాను.

– అపార్, ఓపెన్ టోర్నీ టాప్ ర్యాంకర్

విజయంతో టోర్నీ మొదలు



ఓపెన్‌తో పాటు బాలికలకు ప్రత్యేకంగా ఈ టోర్నీ జరుగుతోంది. ప్రస్తుతం 1615 రేటింగ్‌తో బాలికల్లో టాప్ ర్యాంక్‌తో తొలి రౌండ్ ప్రారంభించాను. చదరంగంపై ఆసక్తితోనే ఈ స్థాయికి చేరాను. తొలి రౌండ్‌లో తమిళనాడుకు చెందిన అభిగలిపై విజయంతో టోర్నీ మొదలుపెట్టాను. మొత్తంగా స్విస్ పద్ధతిలో 11 రౌండ్ల టోర్నీ ఇది. బాలికల కేటగిరీలోనూ ఎరీనా ఫిడే మాస్టర్లు నలుగురు, ఎరీనా క్యాండిడేట్ మాస్టర్లు ఒకరు పోటీపడుతున్నారు. వారితో రానున్న రౌండ్లలో పోటీపడాల్సి ఉంటుంది.

–ఆముక్త, బాలికల టోర్నీ టాప్ ర్యాంకర్

అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలి


ఎంపీపీ కె.బాలకృష్ణ

రంపచోడవరం: రంపచోడవరం పంచాయతీకి సంబంధించి గత కార్యదర్శి ఎన్.వి.ఎస్.సత్యనారాయణమూర్తి పాల్పడిన నిధులు దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని రంపచోడవరం ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిధులు దుర్వినియోగానికి పాల్పడి ఒక లేఖ రికార్డులు పెట్టి వెళ్లిన కార్యదర్శికి ఎల్‌పీసీ (లాస్ట్ పే సర్టిఫికెట్స్) ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రస్తుతం పెద్దాపురం మండలంలో పనిచేస్తున్న కార్యదర్శిని విధులు నుంచి టెర్మినెట్ చేసి అక్రమాలకు పాల్పడిన సొమ్మును తిరిగి పంచాయతీకి జమ చేయించాలన్నారు. కార్యదర్శికి సహకరించిన వారిపై కూడా విచారణ జరపాలన్నారు.

ఇద్దరు హిజ్రాల అరెస్టు

మునగపాక: పాత నాగవరంలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులతో పాటు ఇద్దరు హిజ్రాలను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ మహమ్మద్ అలీ తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా హిజ్రాలతో నృత్య ప్రదర్శన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అలీ సంఘటనా స్థలానికి చేరుకొని ఎటువంటి అనుమతులు లేకుండా హిజ్రాలతో నృత్యం చేయిస్తున్ననిర్వాహకులు అయిదుగురిని అరెస్టు చేశారు.

భారీగా గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

సీలేరు/జి.మాడుగుల: జిల్లాలోని జీకే వీధి, జి.మాడుగుల మండలాల్లో పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి జీకే వీధి మండలం సీలేరు మీదుగా కంటైనర్ వాహనంలో తమిళనాడుకు తరలిస్తున్న 129 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, పదిమంది నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఒడిశా నుంచి వచ్చిన కంటైనర్ వాహనాన్ని తనిఖీ చేయగా 129 కిలోల గంజాయి బయటపడిందని చెప్పారు. పది మంది నిందితులను కోర్టులో హాజరుపరచి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. జి.మాడుగుల మండలంలోని జి.మాడుగుల– కుంబిడిసింగి రోడ్డులో ఆదివారం 55 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. కుంబిడిసింగి పంచాయతీ గెద్దరాయి గ్రామానికి చెందిన వంతాల కొండబాబు బైక్‌పై 55 కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పారు. నిందితుడి నుంచి గంజాయి, బైక్, రూ.85,500 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు చెప్పారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు


అవగాహన సదస్సులో ఎంపీపీ బందం శ్రీదేవి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు

రంపచోడవరం: మండలంలోని ఐ.పోలవరం గ్రామంలో వారాహ క్లెమైట్ ఆగ్ ఆధ్వర్యంలో గిరిజన మిత్రా ద్వారా రైతులకు వాతావరణ మార్పులు, వ్యవసాయ అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలన్నారు. ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. వరాహ కంపెనీ సీనియర్ టీమ్ లీడర్ కళతిల్ శివకుమార్ మాట్లాడుతూ అగ్రో ఫారెస్ట్రీ ద్వారా గిరిజన వర్గాలు, చిన్నకారు రైతుల జీవన ఉపాధిని కార్బన్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ ద్వారా మెరుగు పరచడం తమ లక్ష్యమన్నారు. రైతుల అభివృద్ధికి పెట్టుబడి అవసరం లేకుండా నమోదు చేసుకున్న రైతులందరికీ ఈ ప్రాజెక్ట్ ద్వారా అదనపు ఆదాయ వనరులుగా మరియు మొక్కల రూపంలో ఉపయోగ పడుతుందన్నారు. గిరిజన మిత్రా ఫౌండర్ డాక్టర్ ఉదయ్ శ్రీనివాస్, అరవింద్ కుమార్, కార్తిక్, అప్పన్న, నాగేశ్వరరావు, లింగబాబు, శివ ,బుల్లి దొర గిరిజన రైతులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాలకు సీఎం సహాయ నిధి


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ అనంత బాబు

అడ్డతీగల: ప్రమాదాల్లో కుటుంబ పెద్దలను కోల్పోయి ఇబ్బంది పడుతున్న రెండు కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ అనంత బాబు అందజేశారు. ఎల్లవరంలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో చెక్కులను అందజేశారు. అడ్డతీగల మండలం గొంటువానిపాలేనికి చెందిన వీరాబత్తుల లోవరాజు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడు. రాజవొమ్మంగి మండలం అమీనాబాద్ కాలనీకి చెందిన మెల్లేటి దుర్గబాబు రోడ్డు ప్రమాదంలో మరణించాడు.

ఈ రెండు కుటుంబాలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం మంజూరైంది. ఆ చెక్కులను ఎమ్మెల్సీ అనంత బాబు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా


గొందెలిలో రోగులకు పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

పాడేరు రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల గిరిజనులు అప్రమత్తంగా ఉండి అనారోగ్యం చేస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలో ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ జమల్‌బాషా అన్నారు. మండలంలోని గొందెలి పంచాయతీ కేంద్రంలో ఆదివారం సోషల్ ఆర్మీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్త చైతన్యకర్త గణేష్ కొమ్మోజు సహకారంతో విశాఖపట్నం మెడికోవర్ ఆస్పత్రి యాజమాన్యం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించింది. ఈ వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా ప్రారంభించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 220 మంది రోగులకు వైద్యులు ఉచితంగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు, ఈసీజీ నిర్వహించి మందులను అందజేశారు. గిరిజన ప్రాంతాల్లో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించి గిరిజనులు వైద్య సేవలు కల్పించాలని మెడికోవర్ యామజన్యానికి డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా సూచించారు. మెడికోవర్ వైద్యులు డాక్టర్ నిరంజన్, డాక్టర్ దీపక్, సోషల్ ఆర్మీ యూత్ అసోసియేషన్ ఫౌండర్ మనోజ్, వైఎస్సార్‌సీపీ గ్రామ సచివాలయల మండల కన్వీనర్ పలాసి కోటిబాబు, సిబ్బంది పురుషోత్తం, దీపక్, అభి, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కలప చిత్రంలో ఎస్‌ఐ రాజారావు, అటవీ సిబ్బంది

కొయ్యూరు: అనుమతులు లేకుండా తరలిస్తున్న కలపను కొయ్యూరు ఎస్‌ఐ రాజారావు ఆధ్వర్యంలో సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్ సమీపంలో ఆదివారం వాహనాల తనిఖీలను చేపట్టారు.అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేటకు చెందిన వాహనంలో కలపను తీసుకువస్తుండగా పట్టుబడింది. దీని అనంతరం కలపను అటవీశాఖా సిబ్బందికి అప్పగించారు.పట్టుకున్న కలపలో 30ముక్కలున్నాయి. వాటిలో నల్లమద్ది, గంధ్ర రకం కలప ఉందని అటవీ సిబ్బంది తెలిపారు. చింతపల్లి కలప డిపోకు తరలిస్తున్నామని తెలిపారు.

నేడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విశాఖ రాక

మహారాణిపేట: రాష్ట్రవైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని సోమవారం విశాఖ వస్తున్నారు. సాయంత్రం 4.05 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ఆనందపురం మండలం శొంఠ్యాం వెళ్తారు. అక్కడ రూ.6.67 కోట్లతో నిర్మించే ఆయుర్వేదిక్ ఫార్మసీ అండ్ డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌కు ఆమె శంకుస్థాపన చేస్తారు. అనంతరం విశాఖ చేరుకుని రాత్రికి బస చేస్తారు. 3న ఇసుకతోటలో నిర్మించిన యూపీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తారు. అక్కడ నుంచి పాడేరు వెళతారు.

విద్యాశాఖలో వసూళ్ల పర్వం

- ప్రైవేట్ స్కూళ్ల రెన్యువల్స్‌లో అవకతవకలు
- ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యాశాఖ మంత్రి
- ఆర్జేడీ కార్యాలయ సూపరింటెండెంట్‌పై సరెండర్ వేటు
- సమగ్ర విచారణకు ఆదేశించిన కమిషనర్

విశాఖ విద్య: విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయం కేంద్రంగా సాగుతున్న వసూళ్ల పర్వంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఇందుకు బాధ్యుడిగా కార్యాలయ సూపరింటెండెంట్ ఆనంద్‌రెడ్డిని కమిషనరేట్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఆర్జేడీ జ్యోతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ఈ విషయం వెలుగులోకి రావడంతో విద్యాశాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఏడాది నుంచి ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు, రెన్యువల్ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. భవిష్యత్‌లో అంతా ఆన్‌లైన్ విధానంలోనే ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టనున్నందున, ఇందుకు 2023–24 విద్యా సంవత్సరం నుంచే అమలుకు విద్యాశాఖాధికారులు సిద్ధమయ్యారు. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూళ్లకు ఎంఈవో, డిప్యూటీ డీఈవో సిఫార్సుతో ప్రైవేట్ స్కూళ్ల నిర్వహణకు డీఈవో కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. హైస్కూళ్లకు అయితే డిప్యూటీ డీఈవో, డీఈవో కార్యాలయ స్థాయిలో అన్ని రకాల ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేసి.. స్కూళ్ల నిర్వహణకు అఫిలియేషన్‌ను ఆర్జేడీ ఇస్తారు. ఇదంతా పారదర్శకంగా చేపట్టాలని ఉన్నతాధికారులు నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయితే విద్యాశాఖలోని కొంతమంది అధికారులు, ఉద్యోగులు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఇటీవల కాలంలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్జేడీ కార్యాలయంలో డబ్బులు ఇస్తేనే ఫైలు ముందుకెళ్తోందని, స్కూళ్లను బట్టి గుర్తింపు, రెన్యువల్‌కు రేటు నిర్ణయించి.. డబ్బులు ఇవ్వనదే పనిచేయడం లేదని కొంత మంది ప్రైవేట్ స్కూళ్ల యాజమానులు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్జేడీ కార్యాలయ అధికారులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై సమ్రగ విచారణ చేపట్టాలని ఆదేశించిన నేపథ్యంలో విద్యాశాఖ కమిషనర్ రంగంలోకి దిగారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం సూపరింటెండెంట్ ఆనంద్‌రెడ్డిని కమిషనరేట్‌కు సరెండర్ చేసినట్లు ఆర్జేడీ జ్యోతి కుమారి 'సాక్షి'కి తెలిపారు.

ఎయిర్‌పోర్టులో అదనపు కార్ పార్కింగ్

- ప్రస్తుతం 500 కార్ల నిలిపే సామర్థ్యం
- విస్తరణతో మరో 200 కార్లకు అవకాశం
- ఈ విమానాశ్రయానికి అధికమైన పాసింజర్ల తాకిడి
- గత ఆగస్టుతో పోల్చుకుంటే పెరిగిన ప్రయాణికులు


విమానాశ్రయం పార్కింగ్‌లో కార్లు

ఆగస్టులో ఈ ఎయిర్‌పోర్టు నుంచి సెక్టార్ల వారీ ప్రయాణికుల ఆక్యుపెన్సీ

ఎక్కడకు?	సామర్థ్యం	ప్రయాణికులు	ఆక్యుపెన్సీ (శాతం)
హైదరాబాద్	44,752	42,038	93.94
ఢిల్లీ	21,642	19,542	90.30
బెంగళూరు	26,274	23,028	87.65
ముంబై	12,462	10,800	86.66
చెన్నై	14,400	11,587	80.47
కోల్‌కతా	3,600	3,268	90.78

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి రానురాను ప్రయాణికుల తాకిడి అధికమవుతోంది. అందుకనుగుణంగా ఇప్పటికే ఈ ఎయిర్‌పోర్టు అవసరమైన అన్ని హంగులను సమకూర్చుకుంటోంది. వీటితో పాటు కార్ పార్కింగ్‌ను కూడా విస్తరించుకుంది. ఈ విమానాశ్రయంలో ప్రస్తుత పార్కింగ్‌లో 500 కార్లను నిలిపే సామర్థ్యం ఉంది. ఇటీవల అందుబాటులోకి వచ్చిన పార్కింగ్‌లో అదనంగా మరో 200 కార్లను ఉంచేందుకు అవకాశం కలిగింది. రోజురోజుకూ ప్రయాణికుల రాకపోకలు పెరుగుతుండడంతో వాహనాల రద్దీ కూడా తీవ్రమవుతోంది. దీంతో ఎయిర్‌పోర్టుకు వచ్చే కార్లు, ఇతర వాహనాలను నిలపడానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడేది. ఇప్పుడు అదనపు పార్కింగ్ సదుపాయం అందుబాటులోకి రావడంతో ఆ ఇబ్బంది నుంచి వాహనదార్లకు ఉపశమనం లభించిందని విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు.

తగ్గిన సర్వీసులు.. పెరిగిన ప్రయాణికులు

మరోవైపు విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం దేశీయ (డొమెస్టిక్) ప్రయాణికుల రాకపోకల్లో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని ఇతర ఎయిర్‌పోర్టులకంటే ఈ విమానాశ్రయం నుంచే ఎక్కువ మంది వెళ్లి వస్తున్నారు. 2022–23లో విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, కడప, తిరుపతి, కర్నూలు విమానాశ్రయాల నుంచి 48,25,904 మంది డొమెస్టిక్ పాసింజర్లు రాకపోకలు సాగించగా, వీరిలో ఒక్క విశాఖ ఎయిర్‌పోర్టు నుంచే 24,35,320 మంది ఉన్నారు. ఇక గత ఏడాది ఆగస్టుతో పోల్చితే ఈ ఆగస్టులో విమాన సర్వీసులు తగ్గినప్పటికీ ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత ఆగస్టులో ఈ ఎయిర్‌పోర్టు నుంచి 1,770 విమానాల ద్వారా 2,03,795 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఈ ఆగస్టులో 1,722 విమాన సర్వీసుల ద్వారా 2,41,917 మంది ప్రయాణించారు. అంటే 48 విమాన సర్వీసులు తగ్గినా, 38,122 మంది ప్రయాణికులు పెరిగారన్న మాట!

ఆక్యుపెన్సీలో హైదరాబాద్ టాప్

ఈ ఏడాది ఆగస్టులో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ప్రయాణికుల ఆక్యుపెన్సీ హైదరాబాద్, ఢిల్లీ, కోల్‌కతా సెక్టార్ల విమాన సర్వీసులకు ఎక్కువగా ఉంది. విశాఖపట్నం–హైదరాబాద్‌ల మధ్య తిరిగే విమానాల్లో సీటింగ్ కెపాసిటీ 44,752కి గాను 42,038 మంది (93.94 శాతం) ప్రయాణించారు. విశాఖ–ఢిల్లీల మధ్య సర్వీసులకు 21,642 మంది సీటింగ్ సామర్థ్యం ఉండగా 19,542 మంది (90.30 శాతం) రాకపోకలు సాగించారు.